క్లుప్తంగా

విద్యార్థులకు అల్పాహారం అందజేత



విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లను అందించిన నాయకులు, ఉపాధ్యాయులు

కుల్కచర్ల: రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నర్సింలు యాదవ్ విద్యార్థులకు వారానికి ఒకసారి అల్పాహారం అందజేస్తున్నారు. శుక్రవారం ఉదయం పాఠశాల విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాల ప్రారంభ సమయంలో విద్యార్థులకు అల్పాహారం అందజేయడం బాధ్యతగా భావిస్తున్నానన్నారు. విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కొనసాగుతున్న కబడ్డీ పోటీలు



అనంతగిరి: వికారాబాద్ పట్టణం గౌలికార్ ఫంక్షన్ హాల్‌లో ప్రారంభమైన సబ్‌జూనియర్ అంతర్‌జిల్లాల కబడ్డీ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీలు కొనసాగుతున్నాయి. తెలంగాణలోని ఆయా జిల్లాల నుంచి వచ్చిన కబడ్డీ క్రీడాకారులు శుక్రవారం లీగ్ మ్యాచ్‌లు ఆడారు. క్రీడాకారులు తమ ఆటలో నైపుణ్యాన్ని ప్రదర్శించి తమ సత్తాను చాటుతున్నారు. శనివారం నాకౌట్ దశకు చేరుకుంటాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పరుశరాం, వినోద్‌లు తెలిపారు.

మాతృభాష తల్లివంటిది



కేజీబీవీలో మాతృభాష దినోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

కుల్కచర్ల: మాతృభాష తల్లివంటిదని కస్తూర్బా గాంధి బాలికల ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి దేవి అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని కేజీబీవీలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతీ ఒక్కరికి సొంత భాషపై అభిమానం ఉంటుందని, సొంత భాషను తమ ఇంటిలా భావిస్తారని పేర్కొన్నారు. ఎక్కడికి వెళ్లినా, ఇతర ప్రాంతాలకు వెళ్లినా తమ భాష వచ్చిన వారు కలిస్తే తమ బంధువులు కలిసినట్లుగా అనిపిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

దోమ: అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని శివారెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామంలోని పేద ప్రజలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ప్రతి సంవత్సరం నియోజకవర్గానికి మూడు వేల ఐదువందల ఇళ్లు నిర్మించి ఇవ్వడంతో పాటు ఐదేళ్ల లోపు 20 వేల ఇళ్లు నిర్మించాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. గత ప్రభుత్వం ఏ పేదవాడికి ఇళ్లు నిర్మించి ఇవ్వలేదని విమర్శించారు. ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చెందిన అభ్యర్థులను గెలిపించుకునేలా ప్రజలు సంసిద్ధం కావాలన్నారు.

రూ.25కోట్లు కేటాయించాలి

బొంరాస్‌పేట: పోలేపల్లి ఎల్లమ్మ ఆలయాభివృద్ధికి ప్రభుత్వం రూ.25కోట్లు కేటాయించాలని శుక్రవారం విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం హకీంపేటలో విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి, డబుల్‌రోడ్డు, తదితర సౌకర్యాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అతిపెద్ద జాతరగా గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, చాంద్‌పాషా, శేరినారాయణరెడ్డి, యాదగిరి, నెహ్రూనాయక్,వెంకట నరేందర్ పాల్గొన్నారు.

నిరుపయోగం.. రైతువేదికలు!

- మండలంలో రూ.1.76 కోట్ల ఖర్చుతో నిర్మాణం
- రైతులకు చేకూరని ప్రయోజనం
- ఆందోళన కలిగిస్తున్న నిర్వహణ లోపం
- పట్టించుకోని అధికారులు



బిచ్చాల గ్రామంలో నిర్మించిన రైతువేదిక

దౌల్తాబాద్: మండలంలోని రైతులకు పంటల సాగులో అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ఉపయోగకరంగా ఉంటాయన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం క్లస్టర్ల వారీగా రైతువేదికలు నిర్మించింది. ఈ వేదికలకు సరైన నిర్వహణ లేక పలు క్లస్టర్ గ్రామాల్లో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన రైతు వేదికలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

ఒక్కో రైతువేదికకు రూ.22లక్షల వ్యయం

మండలంలోని దౌల్తాబాద్, నందారం, కుదురుమళ్ల, చల్లాపూర్, గోకఫసల్‌వాద్, దేవర్‌ఫసల్‌వాద్, బాలంపేట, బిచ్చాల క్లస్టర్ గ్రామాల్లో రూ.12లక్షలతో ఉపాధి హామీ పథకం కింద, రూ.10లక్షలు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఒక్కో రైతువేదిక నిర్మాణానికి రూ.22లక్షలు ఖర్చు చేశారు. బిచ్చాల, దౌల్తాబాద్, గోకఫసల్‌వాద్ గ్రామాల్లో ఊరికి దూరంగా నిర్మించడంతో వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా...

గ్రామాలకు దూరంగా ఉన్న రైతువేదికల వద్ద పలు అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నాయి. చీకటి పడిన వెంటనే మద్యం ప్రియులు రైతువేదికల వద్దకు వెళ్లి మద్యం తాగుతున్నారు. కంపౌండ్ వాల్ నిర్మించకపోవడంతో ఇలాంటి పరిస్థితి దాపురిస్తుందని రైతులు వాపోతున్నారు. బిచ్చాల క్లస్టర్ రైతువేదిక గ్రామానికి దూరంగా ఉండడంతో అక్కడ ప్రతి రోజు మద్యం ప్రియులు మద్యం సేవిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోంది. గోకఫసల్వాద్ గ్రామంలో కూడా రైతువేదిక నిర్వహణ లేక అధ్వానంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి రైతువేదికలకు అవసరమైన ఫర్నీచర్‌తో పాటు విద్యుత్ వసతి, మూత్రశాలలు, మంచినీటి సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

> **రైతుల అవసరాలకే..**
>
> మండలంలో నిర్మించిన రైతువేదికలను రైతుల అవసరాలకే వినియోగిస్తున్నాం. క్లస్టర్ స్థాయి ఏఈఓలు రైతువేదికల వద్ద రైతులను సమీకరించి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. రైతువేదికల వద్ద ఉత్పన్నమవుతున్న సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తాం.
>
> – లావణ్య, ఏఓ, దౌల్తాబాద్

పన్ను వసూళ్లలో శ్రద్ధ తీసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి



మాట్లాడుతున్న విక్రమ్‌సింహా రెడ్డి

తాండూరు టౌన్: పన్ను వసూళ్లలో శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి పేర్కొన్నారు. మార్చి నెలాఖరు వరకు వందశాతం పన్ను వసూళ్లను లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ ఉద్యోగులు, వార్డు ఆఫీసర్లు, ఆర్పీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ట్రేడ్ లైసెన్స్, నల్లా, ఆస్తి పన్నుల వసూళ్లలో మున్సిపాలిటీ వెనుకబడి ఉందన్నారు. పట్టణంలోని వార్డులన్నింటికీ వార్డు ఆఫీసర్లను నియమించామని, వారికి ఆర్పీలు సైతం సహకరిస్తారన్నారు. వార్డుల్లో కలియ తిరుగుతూ మార్చి నెలాఖరు వరకు వందశాతం పన్ను వసూళ్లను చేయాలని ఆదేశించారు. అలాగే వార్డుల్లోని పారిశుద్ధ్యం, ఇంటింటికి చెత్త సేకరణ తదితర విషయాలపై కూడా వార్డు ఆఫీసర్లు దృష్టి సారించాలన్నారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, ఆర్వో అశోక్, మెప్మా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు కృషి

ఎంఈఓ వెంకట్



రాకొండ పాఠశాలలో విద్యార్థుల ప్రతిభను పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకట్

దోమ: ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని ఎంఈఓ వెంకట్ పేర్కొన్నారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని రాకొండ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పరిసరాలను చూసి, ఆ తర్వాత రికార్డులను పరిశీలించారు. తదనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. వారిలో ఉన్న ప్రతిభను పరీక్షించేందుకు ప్రశ్నలు అడుగుతూ బోర్డుపై జవాబులను రాయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పాఠశాలలో తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎఫ్ఏ1, ఎఫ్ఏ2, ఎస్ఏ1, ఎస్ఏ3 ఆన్ లైన్‌లో ఎంట్రీ చేయాలన్నారు. బడీడు పిల్లల సమాచారం సేకరించి నెల నుంచి రాని విద్యార్థులను బడికి రప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో టాయిలెట్స్, కంపౌండ్ వాల్, కిచన్‌షెడ్ లేని వాటిని గుర్తించి వాటి నివేదికలు ఇవ్వాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ సీఆర్‌పీ తదితరులు పాల్గొన్నారు.

‘సాక్షి’ సేవాతత్వం అభినందనీయం



సాక్షి స్టడీ మెటీరియల్‌తో మోడల్ స్కూల్ విద్యార్థులు

ప్రిన్సిపాల్ బ్యూలా

బంట్వారం: సాక్షి యాజమాన్యం సేవాతత్వం అభినందనీయమని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్యూలా అన్నారు. సాక్షి మేనేజ్‌మెంట్ తరపున శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు సాక్షి మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్క్యులేషన్ ఎస్ఆర్ చేతన్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతారం అర్బన్‌పార్కులో తనిఖీలు

అటవీశాఖ పనులపై ఆరా

తాండూరు రూరల్: తాండూరు మండలం అంతారంగుట్ట సమీపంలోని అంతారం అర్బన్‌పార్కును అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. శుక్రవారం అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్, డీఎఫ్ఓ శ్రీనివాస్ రావు, రేంజ్ ఆఫీసర్ విష్ణు, బీట్ ఆఫీసర్లు శ్రీకాంత్, నగేష్ బృందంతో అర్బన్ పార్కును చేరుకుని అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అర్బన్ పార్కులో వాకింగ్ పాత్, కమాన్ పనులతో పాటు పార్కు చుట్టు ఫెన్సింగ్‌పనులు కూడా పరిశీలించారు. అభివృద్ధి పనుల విషయమై గతంలో ఆరోపణలు రావడంతో అప్పట్లో అటవీశాఖ అధికారులను బదిలీ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేయడంతో అటవీశాఖ అధికారుల్లో ఆందోళన మొదలైంది. ఈ కార్యక్రమంలో తాండూరు రేంజ్ ఆఫీసర్ శ్రీదేవి సరస్వతి, సెక్షన్ ఆఫీసర్ ఫిర్యానాయక్, సెక్షన్ ఆఫీసర్ మల్లయ్యలతో పాటు అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



బంట్వారంలో మేకల సంతను ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మెన్ మహేందర్‌రెడ్డి

ఏఎంసీ చైర్మెన్ మహేందర్‌రెడ్డి

బంట్వారం: మర్పల్లి వ్యవసాయ మార్కెట్‌ను జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఏఎంసీ చైర్మెన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన బంట్వారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశంతో కలిసి మేకల సంతను ప్రారంభించి మాట్లాడారు. ఎకరానికి పైగా ప్రభుత్వ స్థలంలో సంతను ఏర్పాటు చేసినట్లు వారు చెప్పారు. త్వరలోనే ఫెన్సింగ్ వేయిస్తానన్నారు. జీవాలకు తాగు నీటి తొట్టిలు కట్టించి సంతలో సీసీ రోడ్డు నిర్మిస్తానన్నారు. పూర్తి స్థాయిలో అవసరమైన వసతులు కల్పిస్తానన్నారు. వ్యాపారులు కొనుగోలుదారులు, అమ్మకందార్లు మేకల సంతను సద్వినియోగం చేసుకోవాలని మహేందర్‌రెడ్డి సూచించారు. అలాగే తొర్మామిడిలో రూ.1.50 కోట్లతో రైతు గోడౌన్ నిర్మించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, ఏఎంసీ వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్, మర్పల్లి సొసైటీ వైస్ చైర్మెన్ ఫసియొద్దీన్, పార్టీ సీనియర్ లీడర్ మొగులయ్య, డైరెక్టర్లు యాదగిరి, శాకం నర్సింలు, ఇసాక్, గాండ్ల నర్సింలు, హరీశ్వర్‌రెడ్డి, రాములు, శ్రీనివాస్‌రెడ్డి, ఎన్.నర్సింలు, మున్నాబాయ్, అజీమ్, గౌస్, అరుణ్, పి.వెంకటయ్య, సుదర్శన్, పాండునాయక్, శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు

వాసవి మహిళా సంఘం అధ్యక్షురాలు నాగలక్ష్మి



విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న వాసవి మహిళా సంఘం సభ్యులు

తాండూరు టౌన్: ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగని వాసవి మహిళా సంఘం తాండూరు అధ్యక్షురాలు కోట్రిక నాగలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం పాత తాండూరులోని ప్రభుత్వ నంబర్ 2 పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు సంఘం తరుపున పరీక్ష ప్యాడ్లు, జామెట్రీ బాక్సు తదితర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి, సంఘం సభ్యులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు చదువుకుంటే కుటుంబంలో జ్ఞానజ్యోతిని వెలిగిస్తారన్నారు. చిన్ననాటి నుంచే అత్యున్నత లక్ష్యాన్ని ఏర్పరచుకుని లక్ష్య సాధనకోసం కృషి చేయాలన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున ఏకాగ్రత, పట్టుదలతో చదివి ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి మంకాల్ స్వప్న, కోశాధికారి సింగంశెట్టి శోభ, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం



పశుపోషకులకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: పశువుల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని రేగడి దోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో పశువుల వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 12 పాడి ఆవులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేశారు. 26 పశువులకు చూడి పరీక్షలు నిర్వహించి, 30 దూడలు, గేదెలకు నట్టల నివారణ మందులు తాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సకాలంలో పశువులకు వైద్యం అందిస్తే అధిక పాల దిగుబడి వస్తుందని తెలిపారు. మేలు రకం పశువుల ఎంపిక ద్వారా ఆదాయం పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో గోపాలమిత్ర విద్యాసాగర్, వైద్య సిబ్బంది శ్రీనివాస్, సుధాకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



సీఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న నాయకులు

కుల్కచర్ల: నిరుపేద బడుగుబలహీనవర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రానికి చెందిన రాజుకు సీఎం సహాయ నిధి చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... అనారోగ్య సమస్యలు తలెత్తిన సందర్భంలో ఆరోగ్యశ్రీ క్రింద పరిగణలోకి రాని వైద్యచికిత్సలు, ఆస్పత్రి సంబంధిత ఆర్థిక ఖర్చులను పరిగణనలోకి తీసుకుని పేద ప్రజలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూతనిస్తుందన్నారు. వైద్యం కోసం ఇబ్బందులకు గురయ్యే వారికి ప్రభుత్వం తోడుగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జోగు వెంకటయ్య, ఆనందం, తమ్మలి రాంచంద్రయ్య, రాజు, ఎల్లయ్య, వెంకటేష్, నరహరి, శ్రీను, మురళీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల మృత్యు ఘోష!

- విద్యుత్ షాక్‌తో చనిపోతున్న పశువులు
- ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయకపోవడంతోనే ఘటనలు
- జీవనోపాధి కోల్పోతున్న పాడి రైతులు
- పట్టించుకోని అధికారులు



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెందిన పశువులు (ఫైల్)

దౌల్తాబాద్: ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యానికి మూగజీవాలు బలవుతున్నాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో షాక్‌కు గురై మృత్యువాత పడుతున్నాయి. వీటిపైనే ఆధారపడిన రైతులు జీవనోపాధి కోల్పోతున్నారు. మండలంలో 33గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో సుమారు 300వరకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారులు, వ్యవసాయ క్షేత్రాలు, గ్రామాల్లోని ఆయా కూడళ్లలో ట్రాన్స్‌ఫార్మర్లకు ఇప్పటి వరకు కంచెలు ఏర్పాటు చేయలేదు. ఈ విషయంలో అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదు. దీంతో అటుగా వెళ్తున్న మూగజీవాలు విద్యుత్‌షాక్‌కు బలవుతున్నాయి. దౌల్తాబాద్ గ్రామానికి చెందిన ఓ రైతుకు చెందిన ఎద్దు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకి అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో ఆ రైతు రూ.60వేలు నష్టపోయాడు. మూడున్నరేళ్లు కావస్తున్నా ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందలేదని బాధిత రైతు వాపోయాడు. తాజాగా దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఓ రైతు గేదె ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతి చెందింది. గతేడాది గోకఫసల్‌వాద్ గ్రామానికి చెందిన రైతువి రెండు ఎద్దులు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృత్యువాత పడ్డాయి.

కొన్నింటికి మాత్రమే కంచె..

గతంలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లపై పత్రికల్లో కథనాలు రావడంతో స్పందించిన ప్రభుత్వం ఇనుప కంచెలను మంజూరు చేసింది. మిగతా వాటికి ఎప్పుడు ఏర్పాటు చేస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో అత్యవసర పరిస్థితుల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు పోలేని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

> **కంచెలు ఏర్పాటు చేయిస్తాం**
>
> ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే కంచె ఏర్పాటు చేయిస్తాం. మంజూరైన వాటికి ఏర్పాటు చేయించాము. కొన్నింటికి మంజూరు కాలేదు. నిధులు మంజూరైతే ఏర్పాటు చేయిస్తాం. రైతులు పశువులపై జాగ్రత్తలు వహించాలి. మృతి చెందిన వాటికి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు కొన్నింటికి నష్టపరిహారం అందజేశాం.
>
> – మహిపాల్ , ఏఈ, దౌల్తాబాద్

శ్రీశైలానికి తరలిన శివస్వాములు



శ్రీశైలం బయలు దేరిన శివస్వాములు

మోమిన్‌పేట: శివ స్వాములు మాల ధరించి 41రోజుల పాటు కఠోర దీక్ష బూని శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు శుక్రవారం బయలు దేరారు. మండల పరిధిలోని టేకులపల్లి, ఏన్కతల గ్రామాలకు చెందిన శివస్వాములు గురువారం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి కట్టుకొని మల్లికార్జున స్వామి దర్శనానికి తరలారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

- పెద్ద ఎత్తున హాజరైన భక్తులు
- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- బెల్కటూర్‌లో ఆధ్యాత్మిక వాతావరణం



బెల్కటూర్‌లో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని బెల్కటూర్ గ్రామంలో మల్లికార్జున దేవాలయంలో శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, ధ్వజారోహణం, కలశపూజ, గణపతిపూజలు చేశారు. కల్యాణంలో అల్లిపూర్ వెంకటేష్–భాగ్యశ్రీ, పట్లోళ్ల శంకర్–అనిత, గాండ్ల సంగప్ప, శివలక్ష్మీ, సంతోష్–అన్నపూర్ణదేవి, సుధీర్–సుశీల దంపతులు పాల్గొన్నారు. మఠం రాజేశ్వరయ్య ఆధ్వర్యంలో కల్యాణాన్ని నిర్వహించారు. బెల్కటూర్ గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, శివస్వాములు కల్యాణాన్ని తిలకించారు. శివస్వాముల భజన పాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం స్వామివారికి నైవేద్యం, అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో మల్లికార్జున దేవాలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. బెల్కటూర్, చిట్టిఘనాపూర్, చంద్రవంచ, కరన్‌కోట్, ఓగిపూర్ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పూజలు

బెల్కటూర్‌లో నిర్వహించిన శివపార్వతుల కల్యాణంలో స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లికార్జున దేవాలయ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యేను శివస్వాములు కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి భక్తులు, శివస్వాములు శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగప్ప, నాయకులు నారాయణరెడ్డి, గాండ్ల సంగప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న శివస్వాములు, గ్రామస్తులు